క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింద పేర్కొన్న ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 7 నుంచి 9 గంటల వరకు...
పూలతోట, మాదన్నపేట పీఎస్, మసీద్ ఏ హజారం, ఇండియా ఫంక్షన్‌హాల్, లాబ్‌బైక్ హోటల్ పరిసర ప్రాంతాలు.

ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు..
ఫతేషానగర్, అక్బర్‌నగర్, మహమ్మద్ నగర్ నాలా, మోయిన్‌బాగ్, జావేద్‌నగర్, పీఎస్ నగర్, ముబారక్ దౌలా, కుమ్మరవాడీ కాలనీ, శ్రావణి హాస్పిటల్, లలితాబాగ్, జ్యోతి బాగ్, అలియాబాగ్, అలీ నగర్, అగ్రికల్చర్ ఏరియా పరిసర ప్రాంతాలలో కరెంట్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

గాజులతో అమ్మవారికి అలంకరణ



మన్సూరాబాద్: డివిజన్ పరిధి సాయినగర్ కాలనీలో గల దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారిని శుక్రవారం గాజులతో అలంకరించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గణేశ్‌యాదవ్, పురోహితులు బాలమురళి శర్మ, యాదగిరి, హన్మంతరావు, రవి, మురళి, రమణమూర్తి, కృష్ణమూర్తి, రమేశ్, కేశవులు పాల్గొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో లావణ్య త్రిపాఠీ సందడి



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్‌లో సినీ నటి లావణ్య త్రిపాఠీ సందడి చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఓ జ్యువెలరీ షోరూమ్‌ను ఆమె ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం యువజన కార్యదర్శిగా నరేశ్



ఎల్‌బీనగర్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా ఎల్‌బీనగర్‌కు చెందిన కొడవకంటి నరేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశారు.

కామినేని చౌరస్తాలో 'మత్తు' ముఠాల వీరంగం

నాగోలు: నగరంలో మాదకద్రవ్యాలు సేవించే ముఠాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వివిధ చౌరస్తాల్లో రోడ్డు పక్కన ఉంటూ గంజాయి, మద్యం, వైట్నర్ వంటి సేవిస్తున్న కొందరు మత్తులో దారిన పోయేవారితో గొడవకు దిగుతూ వీరంగం సృష్టిస్తున్నారు. ఎల్‌బీనగర్ కామినేని చౌరస్తాలో శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనదారుడితో మాదకద్రవ్యాలు సేవించి మత్తులో ఉన్న ఇద్దరు మహిళలు గొడవపడి అతడిపై దాడి చేశారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు అక్కడికి చేసుకుని ఇద్దరినీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం మహిళా అధ్యక్షురాలిగా భాను

వనస్థలిపురం: కాంగ్రెస్ పార్టీ వనస్థలిపురం డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా ఎర్ర భాను నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి శుక్రవారం ఆమెకు నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు మంజులారెడ్డి, యాదమ్మ, అనిత, మాధవి, సరిత, సుజాత, అలివేలు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ఎర్ర భానుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

స్థానికంగానే సమస్యల పరిష్కారం

- డివిజన్‌వాసులకు చేరువలో వార్డు కార్యాలయాలు
- అందుబాటులో అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది

చైతన్యపురి: కాలనీలు, బస్తీల్లోని చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు నానా అవస్థలు పడాల్సి వచ్చేంది. ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేసేందుకు సమయం, డబ్బు ఖర్చు చేసుకొని ఎంతో దూరంగా ఉండే జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాలకు వెళ్లి ఇబ్బంది పడేవారు. నేరుగా అధికారులకు చెప్పుకోలేక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వడం లేదా.. రాజకీయ నాయకులను ఆశ్రయించడం ద్వారా తమ కాలనీ సమస్యలను పరిష్కరించుకొనేవారు.

- ప్రజల ఇబ్బందులను గ్రహించిన ప్రభుత్వం బస్తీలు, కాలనీల్లోని సమస్యలను స్థానికంగానే పరిష్కారం చేయాలనే తలంపుతో డివిజన్ స్థాయిలో వార్డు కార్యాలయాను ఏర్పాటు చేసి అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంది.



గడ్డిఅన్నారం డివిజన్ వార్డు కార్యాలయం

- ఇందులో భాగంగానే గడ్డిఅన్నారం డివిజన్ వార్డు కార్యాలయాన్ని వీవీనగర్ కాలనీలోని బస్తీ దవాఖానా భవనం మొదటి, రెండవ అంతస్తుల్లో ఇటీవలే ప్రారంభించారు.
- అందులో ఒక వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు ఆయా శాఖల సిబ్బంది అందుబాటులో ఉంటారు.
- విద్యుత్, డ్రైనేజీ ఎంటమాలజీ, శానిటేషన్, ఇంజినీరింగ్, స్ట్రీట్‌లైట్స్, జలమండలి, టౌన్ ప్లానింగ్ తదితర సమస్యలపై నేరుగా వార్డు కార్యాలయాలకు వెళ్లి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదు చేసి సత్వరం పరిష్కారం చేసుకునేలా వార్డు కార్యాలయం అందుబాటులోకి వచ్చింది.
- 2వ, 3వ ఫ్లోర్‌లో ఉండటం వల్ల ఇబ్బందులు వార్డు కారాలయం చిన్న భవనంలోని మొదటి, రెండవ అంతస్తుల్లో ఏర్పాటు చేయటం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని కొందరు సీనియర్ సిటిజన్లు పేర్కొంటున్నారు.
- మహిళలు, వృద్ధులు సులువుగా వెళ్లే విధంగా మరోచోట వార్డు కార్యాలయాన్ని మారిస్తే బాగుంటుందంటున్నారు.
- అలాగే చిన్న పాటి మరమ్మతులు చేసేందుకు వార్డు కార్యాలయ స్థాయిలో బడ్జెట్ కేటాయిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందంటున్నారు.

వార్డు ఆఫీస్‌లో ఉండే సిబ్బంది, ఫోన్ నంబర్లు

1) వై.బాబూరావు	వార్డు అడ్మినిస్ట్రేటివ్ అధికారి	9182320696
2) యు.విజయశ్రీ రెడ్డి	వార్డు ఇంజినీరు	9030701545
3) వి.యాదగిరి	శానిటరీ జవాన్	9494245692
4) ఎస్.శోభ	కంప్యూటర్ ఆపరేటర్	8309149528
5) ఎస్.ప్రవీణ్‌కుమార్	యూబీడీ సూపర్‌వైజర్	9703291473
6) అర్జున్	వార్డు ఎంటమాలజిస్ట్	9985142509
7) పి.సైదులు	స్ట్రీట్‌లైట్స్ ఇన్‌ఛార్జి	9642387877
8) బి.శైలజ	వార్డు టౌన్ ప్లానర్	9701102172
9) ఎ.భవాని	వార్డు కమ్యూనిటీ ఆర్గనైజర్	9441895305
10) ఇ.సుగుణాకర్‌రెడ్డి	జలమండలి అధికారి	8309956542
11) బాల్‌రెడ్డి/సాయిలు	ఎలక్ట్రికల్ అధికారి	9849287405
		9701536797

అవగాహన కల్పిస్తున్నాం



సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వార్డు కార్యాలయాన్ని వినియోగించుకునేలా కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా కాలనీవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. వార్డు కార్యాలయం దృష్టికి తీసుకొస్తున్న సమస్యలపై ఆయా శాఖల సిబ్బందిని అప్రమత్తం చేసి సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నాం. అలాగే మై జీహెచ్‌ఎంసీ యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే కొందరు ఫిర్యాదు చేసుకుంటున్నారు. నేరుగా వార్డు కార్యాలయానికి వచ్చినవే కాకుండా ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులపై కూడా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నాం.

–వై.బాబూరావు, వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, గడ్డిఅన్నారం డివిజన్

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయి

సైదాబాద్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని పార్టీ సీనియర్ నాయకుడు మడిగెల విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సైదాబాద్ డివిజన్ ఏపీఏయూ కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో మలక్‌పేట బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పార్టీ మొదటి జాబితాలో చోటు దక్కించుకున్న తీగల అజిత్‌రెడ్డికి ఆయన శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్‌భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ, ఉద్యమం ద్వారా పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చి దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు అందరూ ఆదరిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి గెలిచి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావటం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.



అజిత్‌రెడ్డిని సన్మానించిన విజయ్‌భాస్కర్‌రెడ్డి

తాగునీటి పైప్‌లైన్లు ఆధునీకరిస్తున్నాం



వాణీనగర్‌లో తాగునీటి పైప్‌లైన్లను ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లోని అన్ని తాగునీటి పైప్‌లైన్లను ఆధునీకరిస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వాణీనగర్‌లో నిర్మాణం పూర్తైన తాగునీటి పైప్‌లైన్లను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఎస్‌సదన్‌లోని పలు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల వల్ల ఆయా ప్రాంతాల వారు కలుషిత నీరు, లో ప్రెషర్ నీటి సరఫరా వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్టు తన పర్యటనల్లో గుర్తించానన్నారు. డివిజన్‌లోని తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఐఎస్‌సదన్‌లోని అన్ని ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. పైప్‌లైన్ పనులు పూర్తైన ప్రాంతాల్లో వెంటనే రహదారులు వేస్తామన్నారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ డీఈ కదిర్, ఏఈ మినాజ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానికులకు ఇళ్లు కేటాయించే వరకు ఉద్యమం ఆగదు



డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఎరుకల నాంచారమ్మ బస్తీవాసులు

మన్సూరాబాద్: ఎరుకల నాంచారమ్మ బస్తీలోని డబుల్‌బెడ్రూమ్ సముదాయాల్లో స్థానికులకు ఇళ్లు కేటాయించే వరకు ఉద్యమం ఆగదని ఎరుకల సంఘం నాయకులు జగన్నాథం, గంగయ్య స్పష్టం చేశారు. డబుల్ ఇళ్లు కేటాయించకపోవడంతో స్థానికులు డబుల్ ఇళ్ల సముదాయాల వద్ద శుక్రవారం రాత్రి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాగోలు డివిజన్ మన్సూరాబాద్ గ్రామ పరిధిలోని ఎరుకల నాంచారమ్మ బస్తీలో 288 డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టారని, 200 ఇళ్ల వరకు లబ్ధిదారులకు అందజేశారన్నారు. మిగిలిన ఇళ్లను ఇక్కడే నివాసముంటున్న స్థానికులకు ఇవ్వాలని పలుమార్లు ఎమ్మెల్యేను, జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నా ఇప్పటికీ కేటాయించలేదన్నారు. స్థానికంగా ఉన్న వారి ధ్రువపత్రాలను పరిశీలించి అర్హులైన స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లింగస్వామి, సిద్ధు, మల్లేష్, పాపమ్మ పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో అవకతవకలపై విచారణకు వినతి

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఓటరు లిస్టులోఅవకతవకలపై విచారణ చేయాలని కోరుతూ బీజేపీ రాంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో సుమారు 73 వేల ఓట్లపై విచారణ జరిపి, నూతన జాబితాను తయారు చేయాలని కోరారు. నాయకులు క్లైం వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వంశీ, జోషి పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

మెగా డీఎస్సీ నిర్వహించాలి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 22 వేల టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దపూర సైదులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆర్‌కేపురంలో విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పీఆర్సీ కమిటీ నివేదిక సమర్పించగా, అందులో 5 వేల పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రకటించడం దారుణమన్నారు. ప్రాథమిక పాఠశాలలో 22 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ముఖ్యమంత్రి కేసీఆర్ శాసన సభలో వెల్లడించగా, వాటిలో 13వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం గతేడాది ఏప్రిల్‌లో ప్రకటించిందన్నారు. కానీ ఇప్పుడు 5,089 పోస్టులు భర్తీ చేయడం సరికాదన్నారు. మొత్తం టీచర్ పోస్టులు భర్తీ చేయకపోతే సచివాలయం, ప్రగతి భవన్‌ను నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ముట్టడిస్తామని పెద్దపూర సైదులు హెచ్చరించారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



అపార్ట్‌మెంట్‌లో చెలరేగుతున్న మంటలు

చాదర్‌ఘాట్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అపార్ట్‌మెంట్‌లో మంటలు చెలరేగాయి. వివరాలు.. ఓల్డ్‌మలక్‌పేట రేస్‌కోర్స్ రోడ్‌లోని అన్నపూర్ణ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న పాత అపార్ట్‌మెంట్ 2వ అంతస్తులో శుక్రవారం సాయంత్రం మంటలు వచ్చాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఫైరింజిన్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

భారీ గణపతి ఏర్పాటుకు భూమి పూజ

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ కమలానగర్‌లో మణికంఠ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో భారీ గణపతి విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భక్త సమాజం కన్వీనర్ తులసి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సుమారు 33 అడుగు ఎత్తైన గణపతిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్త సమాజం అధ్యక్షుడు రాజుకుమార్, ఉపాధ్యక్షుడు బాబూరావు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, కోశాధికారి సిద్దార్థ, కాలనీవాసులు పాల్గొన్నారు.

నిత్య అన్నసత్ర సంఘానికి విరాళం అందజేత

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీకి చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద అహోబిలం లక్ష్మీ నరసింహస్వామి నిత్య అన్నసత్ర సంఘానికి రూ.25 వేల విరాళం అందజేశారు. విరాళం చెక్కును ఆయన శుక్రవారం నిత్య అన్నసత్ర సంఘం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మురళీ, నగేష్, విజయ్, అజయ్‌రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా



హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం: ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పించి నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనస్థలిపురం డివిజన్‌లో రూ. 1.20 కోట్లు, హయత్‌నగర్ డివిజన్‌లో రూ. 4 కోట్ల నిధులతో పలు కాలనీలలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డిలతో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి 4752 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని, కలెక్టరేట్‌లో తీసిన లక్కీడ్రా ద్వారా 500 మందికి ప్రతాప్ సింగారంలో ఇళ్లు కేటాయిస్తారని చెప్పారు. విడతల వారీగా అర్హులందరికీ ఇళ్లు ఇస్తామన్నారు. లక్కీడ్రాలో ఇళ్లు వచ్చిన వారు తమ తమ పత్రాలతో శనివారం ఉదయం 7 గంటలకు ఎల్‌బీనగర్ మున్సిపల్ కార్యాలయం వద్దకు వస్తే అధికారులు వారిని బస్సుల్లో ఇళ్లు కేటాయించిన ప్రాంతానికి తీసుకెళ్తారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు కుంట్లూరు వెంకటేశ్‌గౌడ్, చింతల రవికుమార్, శ్రీధర్‌గౌడ్, వేములయ్యగౌడ్, సామ వెంకట్‌రెడ్డి, కేఎల్‌ఎన్ రావు, శ్రావణ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మేరీ మాటీ..మేరా దేశ్'ను విజయవంతం చేయాలి

హస్తినాపురం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపులో భాగంగా చేపట్టిన 'మేరీ మాటీ..మేరా దేశ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హస్తినాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని ప్రతి గ్రామం, ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి దేశ రాజధాని ఢిల్లీలోని పవిత్ర అమృత వాటికను నిర్మిస్తారని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నరేశ్‌యాదవ్ శుక్రవారం హస్తినాపురం సెంట్రల్‌లోని రామాలయం దగ్గర 'మేరీ మాటీ..మేరా దేశ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాయకులు అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, జీవన్‌రెడ్డి, శిరీష, భాస్కర్‌రెడ్డి, రాఘవేంద్రయాదవ్, శేఖర్‌గౌడ్, సుశీలరెడ్డి, శ్రీనివాస్, మాధవ్ పాల్గొన్నారు.

మట్టి, బియ్యపు గింజల సేకరణ

లింగోజిగూడ: 'మేరీ మాటీ..మేరా దేశ్' ప్రచారోద్యమంలో భాగంగా శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బీజేపీ నాయకులు అమృత కలశంతో మట్టి, బియ్యపు గింజలను సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా ఇలాంటి దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించమని కేంద్ర పార్టీ తమను ఆదేశించడం గర్వకారణమన్నారు. మట్టి సేకరణ అనంతరం సామూహికంగా పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్, కొత్త రవీందర్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, కిరణ్ కుమార్, రాకేష్ యాదవ్, భోస్లే శ్రీనివాస్, కృష్ణంరాజు, హరి ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.



అమృత కలశంతో మట్టి, బియ్యపు గింజలను సేకరిస్తున్న సామ రంగారెడ్డి తదితరులు

శ్రీనివాసపురంలో...

వనస్థలిపురం: 'మేరీ మాటీ..మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా వనస్థలిపురం శ్రీనివాసపురం కాలనీలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం బీజేపీ నాయకులు అమృత కలశంతో మట్టి, బియ్యపు గింజలను సేకరించారు. బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు నూతి శ్రీనివాస్, కొత్త రవిందర్‌గౌడ్, అంజన్‌కుమార్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వరాలివ్వు తల్లీ!

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

దిల్‌సుఖ్‌నగర్: మూడవ శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాన్ని మలక్‌పేట జోన్ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. ఆర్‌కేపురం అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత, దుర్గాదేవి ఆలయాలతో పాటు, మలక్‌పేటలోని ఆండాళ్ నిలయం, మాదన్నపేటలోని దుర్గాదేవి ఆలయం, సైదాబాద్‌లోని జయదుర్గా, విజయదుర్గాదేవి ఆలయం, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలు, ఇళ్లలో మహిళలు వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.



అష్టలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి

సైదాబాద్: అర్హులందరూ తమ పేర్లను ఓటరుగా నమోదు చేయించుకోవాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం సైదాబాద్ డివిజన్ పరిధిలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటి ఓటరు పరిశీలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భాగ్యనగర్ జిల్లా పరిధిలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 3 వరకు బూత్‌స్థాయి కార్యకర్తలతో కలిసి పార్టీ నాయకులు ఇంటింటి ఓటరు పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఇంటింటి ఓటరు పరిశీలనలో పార్టీ కార్యకర్తలతో కలిసి బూత్ లెవల్ ఆఫీసర్లు పాల్గొనాలన్నారు. ఇంటింటికి వెళ్లి అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేయించటమే కాకుండా అనర్హులను వెంటనే తొలగించేందుకు బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. మహిళామోర్చా నాయకులు పాల్గొన్నారు.



ఇంటింటి ఓటరు పరిశీలనలో పాల్గొన్న సురేందర్‌రెడ్డి

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ప్రజానివాస్ ఫేస్-1లో నిర్మిస్తున్న స్ట్రామ్ వాటర్ డ్రైనేజ్ పనులను శుక్రవారం ఆయన ఏఈ మాతృనాయక్ తో కలిసి పరిశీలించారు. వరద నీటి డ్రైనేజీ నిర్మాణ పనులను కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఏఈతో అన్నారు. అనంతరం కొత్తపేట గ్రామం న్యూ మారుతి నగర్ వార్డు కార్యాలయం ఎదురుగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రజానివాస్ ఫేజ్- 1 సెక్రటరీ ప్రసాద్, నాయకులు సుందర్ నారాయణ, గట్టు మహేష్ కుమార్, సంగ్రామ్, వెంకటేష్ పాల్గొన్నారు.